""అంతే సుందర్! నలభై ఎనిమిది గంటలవరకూ చూడు. ఈ లోగా హరి నానీని పట్టుకోగలగాలి లేదా వాడ్ని అరెస్ట్ చెయ్. యస్ తప్పదు"
ఆదేశించాడు.

ఇది జరిగిన మరో అరగంటలో పోలీస్ స్టేషన్‌కి చేరిన సుందర్ యశస్విని విడిచిపెట్టడంతోపాటు తనకి అత్యంత ప్రీతి పాత్రుడయిన కానిస్టేబుల్స్‌ని పిలిచి "నానీ' ఫోటో చూపించి పట్టుకురావాలన్నాడు. పట్నమంతా నిద్రాహారాలు మాని గాలించమన్నాడు.

ఇదే సమయానికి హరి కూడా రంగంలోకి దిగి తన అనుచరుల చేతికి నానీ ఫోటో వున్న దినపత్రికలందించాడు.

"వీడు కనబడగానే పొడిచి చంపేయండి. ఆనక ఆ శవం గురించి నాకు తెలియచేయండి. ఇన్ని హత్యలతో అరాచకాలతో యింత అనుభవం గల మనందరికీ ఇదో సవాల్....." ఒక్క క్షణం ఆగి సాలోచనగా అన్నాడు.

"అనసూయని నేను చంపగా చూసింది నానీగాడొక్కడే. ఆ విషయం ఆ తవిటయ్యా గాడికి తెలిసిందీ అంటే బహుశా నానీ వాడిదగ్గరన్నా వుండి తీరాలి. కనీసం వాడి ఆచూకీ అయినా తవిటయ్యకి తెలిసి ఉండాలి"

నలుగురు తవిటయ్య దగ్గరికి బయలుదేరారు.

సరిగ్గా ఈ సమయంలో....

నానీ కడుపులో ఆకలి దహించి వేస్తుంటే స్మశానపు గుడిసెలోనే కూర్చుని వెక్కిపడుతున్నాడు.

తవిటయ్య బయటకెళ్ళి రెండు గంటలయింది.

సత్తుగిన్నెలో అన్నం పెట్టాడుగానీ తినాలనిపించలేదు.

ఆ చిన్ని మనస్సు జరుగుతున్న ఏ సంఘటననీ జీర్ణించుకోలేక పోతూంది.

అమ్మ చూపించిన ప్రపంచంగాని తాతయ్య చెప్పిన కథలు గాని ఇక్కడిలా లేవు.

అప్పుడు చూశాడు నానీ.

ఓ హాస్పిటల్ అంబులెన్స్ స్మశానం ముందు ఆగింది.

అందులోనుంచి తవిటయ్య మరి కొందరి సహాయంతో అనసూయ శవాన్ని దించాడు.

అనసూయ ఎవరూలేని ఆడది. కాని ఆ రోజు తవిటయ్య కూతురై పోయింది. ఆ పసికందుచేత కొన్ని గంటలపాటన్నా 'అమ్మా' అని పిలిపించుకున్న అనసూయ నానీచేత 'తాతయ్యా' అనిపించుకున్న తవిటయ్యకు దేవుడిచ్చిన కూతురయిపోయింది.

ఎన్ని శవాలదగ్గరో మిగిలిన కట్టెల్ని చితిగా పేర్చాడు.

అతడి కళ్ళు
వర్షిస్తున్నాయి.

అంతా వరుసగా చేసుకుపోతున్న తవిటయ్య యిక చితికి

నిప్పంటించేవాడే.

సరిగ్గా అప్పుడు ముందుకు వచ్చాడు నానీ 'తాతా!'

"అమ్మకదా...." అన్నాడు తవిటయ్యనే చూస్తూ.

గొంతులోకి తన్నుకొచ్చిన బాధ తవిటయ్యని మాట్లాడనివ్వలేదు. నెమ్మదిగా తలూపాడు.

"అవును బాబూ! నా కూతురంటే నీకు అమ్మేకదా"

"అప్పుడు...అమ్మకి......" దుఃఖంతో నానీ గొంతు పూడుకు పోయింది. "నేనే అగ్గి పెట్టాలిగా.... నీకు తెలీదు.... ఈ అమ్మేమో తను చచ్చిపోయాక నన్నే చితి పెట్టమందన్నమాట..... ఒట్టు తాతయ్యా...... నిజం"

తవిటయ్య కళ్ళు నీటికుండలు కాగా తలూపుతూ కొరివిని నానీ చేతి కందించాడు.

నెమ్మదిగా చాలా నెమ్మదిగా అనసూయ తనవేపుకు నడిచాడు నానీ.

"నేను పోయాక తలకొరివి పెడతావా" నిన్న బ్రతికి ఉన్న అనసూయ గొంతు ఆత్రంగా అడుగుతోంది.

వెక్కిపడుతూనే నిప్పంటించాడు.

నానీ చూస్తున్నాడు అలాగే.

సరిగ్గా అప్పుడు వినిపించింది ఓ కంఠం "అదుగో....వాడే"

తల తిప్పి చూశాడు.

అక్కడ స్మశాన ముఖద్వారం నుంచి తనవేపే దూసుకొస్తున్నారు నలుగురు దృఢకాయులు. అంతే.... భయంతో కట్టెలా బిగుసుకుపోయాడు.

అది ఓ క్షణంపాటే..... వెంటనే మరో ప్రమాదాన్ని వూహించిన నానీ తేరుకుని సమాధుల మధ్యగా పరుగు తీశాడు.

ఆ పసికందుని చేరుకోడానికి హరి అనుచరులకి ఎక్కువసేపు పట్టేది కాదు.

కాని విధంగా తవిటయ్య అడ్డునిలిచాడు. ఇప్పుడతడి చేతిలో కాలుతున్న ఓ కట్టె వుంది. ఆ కట్టె అనసూయ చితి లోనిదే.

ఏ మలిన పడిన శరీరాన్ని నానీని కాపాడుకోడానికి ఆడ్డంగా ఉంచి తన బ్రతుక్కి ఓ అర్థాన్ని కల్పించుకుందో ఇప్పుడా దేహాన్ని కాల్చే ఓ కట్టె తవిటయ్య చేతి కందింది కాలిపోతున్న తన కళేబరానికి ఓ పరమార్థాన్ని దక్కించుకుంది.

తవిటయ్యకి తెలుసు...... జవసత్వాలుడిగిన తను హరి అనుచరులయిన వాళ్లను ఆపలేనని. కానీ నానీకి కొంత వ్యవధినిచ్చే ప్రయత్నంగా ఆ సాహసం చేశాడు. అది ఎంత ప్రమాదమో తెలుసు..... కాని ఈ మరుభూమికి తను అధిపతి. ఇక్కడ తనను అభయాన్ని కోరే ఏ ప్రాణికయినా తను రక్షణ యివ్వాలి. అందులో తన ప్రాణాలుపోయినా అదృష్టవంతుడే.

తవిటయ్య
అలా ఆలోచిస్తున్న సమయంలోనే హఠాత్తుగా గాలి వీచిన చప్పుడు.

మరుక్షణం పొత్తికడుపులో గుచ్చుకుందేదో.

ఏం జరిగిందీ అతడూహించేలోగా చేతిలో కట్టె జారింది.

తలపై మరేదో బలంగా తాకింది.

ఓ సన్నని మూలుగుతో నేల జారేడు.

దూరంగా అడవిలాంటి ప్రదేశందాకా పరుగెత్తిన నానీ ఇక కదిలే శక్తి లేనట్లు ఓ పొదచాటున నక్కి స్మశానం కేసి చూస్తున్నాడు.

ఆ స్థితిలోనూ ఆలోచిస్తున్నాడు నానీ.

తనంటే ప్రాణమయిన అమ్మ చచ్చిపోయింది తన నెత్తుకుని ముద్దాడే తాతయ్య మంచం పట్టాడు. తనను కాపాడాలనుకున్న యింకో మోటార్‌సైకిల్ అంకుల్ చచ్చిపోయాడు..... అమ్మంత ప్రేమగా అన్నం పెట్టిన అనసూయమ్మ చచ్చిపోయింది. ఇప్పుడు వీళ్ళు తాతలాంటి యింకో తాతయ్య....

చచ్చిపోయాడు.

మాసిన చొక్కాతో కళ్ళొత్తుకుంటూండగా సమీపంలో ఏదో చప్పుడయింది.

ఉలిక్కిపడుతూ చూశాడు పామేదో అనుకుని....

కాదు.... మనుషుల కాళ్ళు..... తనను పట్టుకోటానికి వచ్చి తాతయ్యని కొట్టిన మనుషుల గొంతులు వినిపిస్తున్నాయి.

"గుంట నా కొడుకు..... ఈ చుట్టుపక్కలెక్కడో నక్కేసుంటాడు" అంటున్నారెవరో..

భయంతో మరింత ఒదిగిపోయాడు నానీ.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో తన గుండె చప్పుడు తనకే స్పష్టంగా వినిపిస్తోంది.

"అమ్మా" మనుసులోనే అమ్మను తలుచుకుని ఏడుస్తున్నాడు. """నన్ను చంపుతారటే.... అంతంత పెద్దోళ్ళు నన్ను చంపడానికొచ్చారే.... నేనే తప్పు చేశానే."

"ముసలితొత్తు కొడుకు అడ్డమొచ్చాడుగాని లేకపోతే ఈ పాటికి ఆడి శవాన్ని ఎత్తుకోని హరిబాబు దగ్గరికి తీసుకెళ్ళేవాళ్ళం, ఛ" విసుగ్గా చేతిలోని పేపర్ నేలపైకి విసిరాడు "ఆ గుంటడ్ని చూశాక ఈ ఫోటోతో పనేట్రా" నేలపై పడిన దినపత్రికలో మసకగా కనిపించిన తన ఫోటోని కళ్ళు చిట్లించి చూశాడు నానీ.

అదెందుకలా పడిందో అర్థంకాలేదు. కాని అదే అంతా తనను గుర్తించే అవకాశ మిస్తుందని మాత్రం బోధపడిపోయింది.

చుట్టూ గాలిస్తున్నారు.

ముగ్గురూ పొదలమధ్య నడుస్తుంటే ఒకడు సిగరెట్ వెలిగించి అగ్గిపుల్ల నిర్లక్షంగా

విసిరాడు.

అది సరిగ్గా నానీ మెడపై పడి చురుక్కు మనిపించింది.

'అమ్మా' అన్న పదం  గొంతు దాటబోయింది. కాని చాలా బలవంతంగా నిగ్రహించుకున్నాడు. అలా నిగ్రహించుకోవడమూ కష్టం కావడంతో కొద్దిగా వెక్కిపడ్డాడు.

అప్పుడే చూశాడు దూరం నుంచి ఓ వ్యక్తి.....

ముందు అర్థం కాలేదు పొదమాటున ఒదిగి వున్న ఆకారమేదో. అనుమానంగా అరవబోతూ ఆగాడు.

అదే నానీ ఆ క్షణాన చేసుకున్న అదృష్టం.

అవతలి వ్యక్తి తేరుకుని తన సహచరుల్ని పిలిచేలోగానే  నానీ పరుగెత్తాడు.

ఆకలి, నిస్త్రాణ, అలసట అన్నీ మరిచిన నానీ కేవలం చచ్చిపోతానేమో అన్న భయంతో ఇంకా చావని బ్రతుకు మీది తీపితో
మరోమారు అయిదు నిముషాలలో రోడ్డును చేరుకున్నాడు.

చుట్టూ వున్న ఇళ్ళ మధ్య అలా పరుగెత్తుతూనే ఎవరు శత్రువో ఎవరు కాపాడే దేవుడో తెలీని స్థితిలో రోడ్డు వార వున్న ఓ షాపులో దూరాడు.

ఏదో పుస్తకం చదువుతున్న షాపు యజమాని ఉలికిపాటుగా తలెత్తి ముందు కంపించిపోతున్న నానీని చూశాడు.

ఎందుకొచ్చాడో అర్థం కాలేదు.

కాని ఎందుకొస్తున్నాయో తెలీని కన్నీళ్ళు కనిపించాయి..... వెను వెంటనే ఆ కన్నీటికి కారణమైన యమకింకరుల్లా పరుగెత్తుకొస్తున్న నల్గురు వ్యక్తులు కనిపించారు.